నేతల్లో జమిలి టెన్షన్

పలు కార్యక్రమాల పేరుతో వదులున్న చేతి చమురు

- ఎన్నికలు ఆలస్యమైతే ఇబ్బందేనని ఆవేదన
- బీఆర్‌ఎస్, ప్రతిపక్ష ఆశావహుల్లోనూ ఖర్చు భయం
- పండగల నేపథ్యంలో వారిలో మరింత ఆందోళన

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు అధికార పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో రాజకీయవేడి పెంచగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థులతో పాటు ప్రతిపక్ష పార్టీలోని ఆశావహులకు చేతి చమురు వదులుతోంది. అధికార పార్టీ ప్రకటించిన అభ్యర్థులతోపాటు ప్రతిపక్ష పార్టీలో టికెట్లు ఆశిస్తున్న నాయకులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తమ ఉనికి చాటుకోవడానికి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో జమిలి ఎన్నికలు ఉంటాయా? అనే ప్రచారం ఆ నాయకుల్లో ఆందోళన పెంచుతోంది. ఇంకా ఎన్నికల షెడ్యూలు ప్రకటించక ముందే కార్యక్రమాలతో భారీగా ఖర్చు అవుతోందని ఇంకా ఆలస్యమైతే తమ పరిస్థితి ఏమిటని అధికార పార్టీ అభ్యర్థులతోపాటు ప్రతిపక్ష ఆశావహులు భయంగా ఉన్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు.. ఆపై వచ్చే సద్దుల బతుకమ్మ దసరా పండుగల నేపథ్యంలో ఖర్చు మరింత భారం కానుందని ఆందోళన చెందుతున్నారు.



ప్రజల మద్దతు కోసం..

ప్రజల మద్దతు కూడగట్టేందుకు వివిధ కార్యక్రమాల పేరుతో పాదయాత్రలు, సమ్మేళనాలు, డివిజన్లు/వార్డులు, గ్రామాలు, బస్తీలవారీగా అభ్యర్థులు, ఆశావహులు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. ఈ క్రమంలో వెంట తిరిగే నాయకులు, కార్యకర్తలకు రోజూ ఎంతో కొంత ఖర్చు చేయాల్సి వస్తోంది. కొంతమంది నాయకులైతే ఇప్పటి నుంచే ఆత్మీయ సమావేశాలు, సభల పేరుతో విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఖర్చుకు వెనకాడకుండా జన సమీకరణలు, బల ప్రదర్శన చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వాలు ఖరారు కాగా, ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టింది. చాలా నియోజకవర్గాల నుంచి ఆ పార్టీల తరఫున ముగ్గురు మించి ఆశావహులు ఉన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఆశావహుల్లో ఒకరు ఖర్చుచేస్తూ.. ముందుకు వెళ్తుంటే అదేస్థానం నుంచి టికెట్ కోసం పోటీ పడుతున్న నాయకులు తప్పనిసరిగా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాల్సి వస్తోంది. దీంతో ఎన్నికలు అలస్యమయ్యే కొద్దీ ఈ ఖర్చు మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారుతో..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడంతో.. ప్రధానంగా మేడ్చల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి(మంత్రి), మాధవరం కృష్ణారావు సామాజిక వర్గాలవారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భోజనాలు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. బస్తీలు, వాడలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. సామూహిక భవనాలు, దేవాలయాలకు నిధులు కేటాయిస్తూ ఆయా వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తూ బలం చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

మూడింటిలో బల ప్రదర్శనే..

- కుత్బుల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ టికెట్ ఖరారైన సిట్టింగ్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, టికెట్ ఆశించి.. భంగపడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను కలుస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కూడా ఎవరికి వారుగా భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో భాగస్వామ్యాన్ని పంచుకోలేక ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్ తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.
- మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు టికెట్ కేటాయించినా.. మెదక్‌లో కుమారుడు రోహిత్‌కు టికెట్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో ఉన్నప్పటికీ, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.
- ఉప్పల్‌లో కూడా సిట్టింగ్ కాదని, మరో నేత బండారి లక్ష్మారెడ్డికి టికెట్ ఖరారు చేయటంతో.. ఇద్దరూ ఎవరికి వారుగా వివిధ కార్యక్రమాలతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

కాంగ్రెస్ నేతల దూకుడు

ప్రతిపక్ష కాంగ్రెస్ ఒక్కో నియోజకవర్గం నుంచి అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నారు. ఈ క్రమంలో అధిష్టానానికి తమ బలాన్ని చాటేందుకు పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు 43 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మేడ్చల్, ఉప్పల్ నియోజకవర్గాల్లో కీలక నేతలు టికెట్ ఆశిస్తున్నారు. మరో మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు ఎవరికి వారే తమకే అభ్యర్థిత్వం ఖరారవుతోందన్న నమ్మకంతో ద్వితీయ శ్రేణి నాయకులను సమీకరిస్తూ.. బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

బీజేపీ కార్యక్రమాలు షురూ..

బీజేపీలోనూ పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకులు కూడా తమ కార్యక్రమాలను మొదలు పెట్టారు. జిల్లాలో కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గంలో టికెట్ ఆశిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నా.. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకుంటూ.. వ్యక్తిగతంగా అనుచరులతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో పోటీ పడుతున్న ఆశావహులు కార్యక్రమాల నిర్వహణకు డబ్బు వెచ్చించక తప్పడం లేదు.

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కాప్రా: మరమ్మతుల కారణంగా శనివారం సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు ఏఈ తెలిపారు. 11కేవీ ఎల్లారెడ్డిగూడ, శ్రీరాంనగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినాయక్‌నగర్, హనుమాన్‌నగర్, ఆర్టీసీ కాలనీ, శ్రీనివాస్‌నగర్, గాంధీనగర్, శ్రీరాంనగర్, ఆదిత్యనగర్ విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. శాలివాహన ఎన్‌క్లేవ్, వాయుపురి ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్లారెడ్డిగూడ, కాప్రా, బంజారాకాలనీ, అశోక్‌కాలనీ, వాయుపురి, డిఫెన్స్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మట్టి వినాయకుల పంపిణీ

గౌతంనగర్: వినాయక నవరాత్రుల సందర్భంగా శనివారం సాయత్రం 5 గంటలకు డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్, మల్కాజిగిరి బీ–బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్‌ల సహకారంతో మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు వైనాల ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నియామకం



మాశెట్టి అనిల్‌గుప్తా

గౌతంనగర్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మల్కాజిగిరి కన్వీనర్‌గా ఉడుత నవీన్, కో–కన్వీనర్‌గా గౌతంనగర్‌కు చెందిన మాశెట్టి అనిల్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల జరిగిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితీ నగరం, సెంట్రల్ కమిటీ సమావేశంలో సెంట్రల్ కమిటీ ప్రతినిధులు రావినూతల శశిధర్, రామరాజు నియామక ఉత్తర్వులు జారీ చేశారని వారు తెలిపారు. మల్కాజిగిరిలో రానున్న గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుతంగా జరిగే విధంగా కృషిచేస్తామని నవీన్, మాశెట్టి అనిల్ తెలిపారు.

పవర్‌బోరు పనులు ప్రారంభం



హిల్‌టాప్ కాలనీలో పవర్ బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్

గౌతంనగర్: గత ఎన్నికల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యమని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. గత ఎన్నికల సమయంలో డివిజన్ పరిధిలోని హిల్‌టాప్ కాలనీ ప్రజలకు కాలనీలో నీటి ఎద్దడి నివారణకు పవర్ బోర్ వేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిధులతో ఆయన శుక్రవారం కాలనీలో ఏర్పాటు చేసిన పవర్‌బోరు పనులకు కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ దివ్యజ్యోతి, బీఆర్‌ఎస్ నేత మేకల రాముయాదవ్, కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత హెల్త్ క్యాంప్



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. క్యాంప్‌ను మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్పొరేటర్లు మద్ది యుగేందర్‌రెడ్డి, బచ్చరాజు, అమర్‌సింగ్, ప్రతిభ, భార్గవి, హేమలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ



గౌతంనగర్: వినాయక నవరాత్రులను పురస్కరించుకొని చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో హనుమాన్‌పేట్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైతన్య మహిళామండలి సభ్యులు వై.సుధా, కవిత, సీతమ్మ, రత్నమాల, రాజేశ్వరి, నాగరాణి తదితరులు ఉన్నారు.

థీమ్ పార్కులను అందుబాటులోకి తెస్తాం



థీమ్ పార్కు స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్

బోడుప్పల్: థీమ్ పార్కులను ఏర్పాటు చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. 2023–24 సంవత్సరంలో హరిత హారంలో భాగంగా బోడుప్పల్‌లో ఎస్‌బీఆర్ కాలనీ, అశోక్‌నగర్, ఆర్‌ఎన్‌ఎస్ కాలనీ, లక్ష్మీనగర్‌లో చేపట్టనున్న థీమ్ పార్కు స్థలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థీమ్ పార్కు స్థలాల్లో పలు రకాల మొక్కలతో పచ్చదనం, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. త్వరితగతిన పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈరోజు థీమ్ పార్కు స్థలాలను పరిశీలించి, పూర్తిస్థాయి ప్రణాళిలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

అల్వాల్: వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ఎవరికీ ఇబ్బంది కలగకుండా పోలీసులకు సహకరించుకుంటూ సమన్వయంతో నిర్వహించుకోవాలని మేడ్చల్ జోన్ డీసీపీ, ఐపీఎస్ శబరిష్ అన్నారు. అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఉపేందర్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ మండప నిర్వాహకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను పోటీతత్వం లేకుండా నిర్వహించుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జరుపుకోవాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు అన్ని ఏర్పాట్లను పరిశీలిస్తుండాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసీపీ రఘునందన్‌రావు, అల్వాల్ సీఐ ఉపేందర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అల్వాల్ డీఐ ప్రమోద్‌కుమార్, అల్వాల్ మున్సిపల్ ఎఎంసి స్వామి, సంబంధిత అధికారులు, భాగ్యనగర ఉత్సవ కమిటీ కన్వీనర్ తూఫ్రాన్ లక్ష్మణ్, జేఏసీ నాయకులు సురేందర్‌రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా..



మాట్లాడుతున్న ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఎమ్మెల్యేగా అవకాశం కల్పించండి.. అందుబాటులో ఉండి.. అభివృద్ధి చేస్తానని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని డైమండ్‌హిల్స్ కాలనీవాసులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న రెసిడెన్షియల్ జోన్‌గా మార్చడం సంతోషకరం అన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తానన్నారు. తన ట్రస్టు తరఫున చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారికి వివరించారు. తాను సేవాభావంతోనే రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, ఈక్బాల్, ఆరీఫ్, ప్రభాకర్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కర్తవ్య దీక్షతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి



ఎస్సైలను అభినందిస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు

మేడిపల్లి: పోలీసులు వృత్తి నిర్వహణలో కర్తవ్య దీక్షతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైలుగా పనిచేస్తున్న దశరథ్, నర్సిరెడ్డి సబ్‌ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. వారిని శుక్రవారం ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రజలకు సేవ చేస్తూ డిపార్టుమెంట్‌లో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహబూబ్‌నగర్ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ఉప్పల్ నియోజకవర్గం నుంచి భారీ ర్యాలీకి సిద్ధమైంది బీఆర్‌ఎస్. ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 100 కార్లతో నియోజకవర్గం నుంచి మహబూబ్‌నగర్‌కు బయలుదేరనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు నియోజకవర్గంలోని సూచించిన పాయింట్లకు సకాలంలో చేరుకుని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మోసపూరిత హామీలతో బీఆర్‌ఎస్ దగా



ఉప్పల్: మోసపూరిత హామీలతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను దగా చేస్తోందని పలువురు కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. విజయభేరి అంటేనే కేసీఆర్‌కు భయం పుట్టుకొస్తుందని అన్నారు. ఈ నెల 17న నిర్వహించే విజయభేరి సభకు భారీగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యే విధంగా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ మేరకు ఎ– బ్లాక్ అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హనుమంతరెడ్డి హాజరయ్యారు.

వేలిముద్ర లేనివారికి రేషన్ కట్

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు శంకర్

రామంతాపూర్: తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ కార్డులో పేర్కొన్న ప్రతి కుటుంబ సభ్యుడు తమకు దగ్గరలో ఉన్న రేషన్‌షాప్‌నకు వెళ్లి వేలిముద్రలు వేయాలని రామంతాపూర్, హబ్సిగూడ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సూరం శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు లెక్కలు పారదర్శకంగా ఉంచడం కోసం ప్రభుత్వ ఈ విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. అందుకే రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ వేలిముద్ర వేయాలని కోరారు. వేలిముద్రలు వేయని వారి పేర్లు తొలగిస్తారని తెలిపారు.

మహిళ అదృశ్యం



నర్సమ్మ (ఫైల్)

మేడిపల్లి: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన శుక్రవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ ఇందిరానగర్‌లో బొబ్బిలి నర్సమ్మ(55) నివాసం ఉంటోంది. 2023 సంవత్సరం ఆగస్టు 1వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన నర్సమ్మ ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్, మోహన్‌బాబాకాలనీ, నిర్మల్‌నగర్, మధురానగర్ ప్రాంతాల్లో రూ.65 లక్షలతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సునీల్‌కుమార్, డీజీఎం భాస్కర్, మేనేజర్ నవీన్ కుమార్, నాయకులు ఉపేందర్‌రెడ్డి, ప్రసాద్, సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, మహత్యవర్ధన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి బరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి..?



అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలపై మరో వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా అధికార పార్టీ అభ్యర్థి విషయంలో పార్టీలో కదలికలు మొదలయ్యాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పార్టీ మారతారనే వార్తలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. దీంతో బీఆర్‌ఎస్ అధిష్టానం సైతం అభ్యర్థి మార్పుపట్ల దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో ముందు వరుసలో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఉన్నట్లు తెలిసింది. మరోవైపు మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు స్థానికులకే అవకాశం కల్పించాలంటూ తాము సైతం బరిలో ఉన్నట్లు అధిష్టానానికి సంకేతాలు ఇస్తున్నారు. ఇందుకోసం సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లో పాతవారే అభ్యర్థులుగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయినా సిట్టింగ్ ఎమ్మెల్యే తీసుకునే రాజకీయ నిర్ణయం తర్వాతే ఆ రెండు పార్టీల అభ్యర్థుల ఖరారుపై పార్టీ దృష్టి సారించే అవకాశం ఉంది. ఏదిఏమైనా మరోవారం రోజుల్లో మల్కాజిగిరి రాజకీయ ముఖచిత్రంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్లను సన్మానిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, భారతి సిమెంట్ ప్రతినిధులు

మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూప్‌నకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణాలో విడుదల చేసిందని మార్కెటింగ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ టి.కొండల్‌రెడ్డి తెలిపారు. వికాట్ గ్రూప్ కంపెనీ ప్రపంచంలోని 11 దేశాల్లో విస్తరించి ఉందని మల్లారెడ్డి చెప్పారు. ఉప్పల్‌లోని సవేరా ఏజెన్సీస్ ఆధ్వర్యంలో స్థానిక ఇంజనీర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ బలం చాలా అధికంగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఇంజనీర్స్ డే సందర్భంగా పలువురి ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. సమావేశంలో టి.సతీష్, చీఫ్ మేనేజర్ మార్కెటింగ్, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డీలర్ శంకర్‌రెడ్డి, స్థానిక ఇంజినీర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కుషాయిగూడ: అనారోగ్యంతో మృతిచెందిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, రాజీవ్‌నగర్‌కు చెందిన పాలమాకుల సుదర్శన్ కుటుంబ సభ్యులకు బీఎల్‌ఆర్ ట్రస్టు ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి శుక్రవారం వారికి రూ.10వేలు అందజేసి పరామర్శించారు. ఆపదలో ఉన్న పేదలకు బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆపన్నహస్తం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో శంకర్‌యాదవ్, బుచ్చిరెడ్డి, దూసరి నవీన్‌గౌడ్, భూపతి అశోక్, యాకుబ్, కందుకూరి కృష్ణమూర్తి, శ్రీను, యాదగిరి, గొల్లూరి మనీష్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక చేయూత..

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చర్లపల్లి డివిజన్‌కు చెందిన విజయ్‌ను బీఎల్‌ఆర్ ట్రస్టు ప్రతినిధులు పరామర్శించారు. బీఎల్‌ఆర్ ఉప్పల్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంకిర్యాల నర్సింహా, పాండు, భూపాల్, గోవిందరాజు, బాబు పాల్గొన్నారు.

అంతా కలిసి ఉత్సవాలను వేడుకగా జరుపుకోవాలి



మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: వినాయక చవితి ఉత్సవాలను మరింత వేడుకగా జరుపుకోవాలని, అందుకు పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖలు, మండప నిర్వాహకులు సహకరించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. గురువారం సాయంత్రం ఉప్పల్ రామస్వామి ఫంక్షన్ హాల్‌లో ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో వినాయక మండప నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, సినీ నటుడు రఘుబాబు, సీఐ గోవింద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యనగరంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను అందరూ కలిసి ఘనంగా జరుపుకుంటారని, అన్ని మతాల వారు ఒకరినొకరు గౌరవించుకోవడం ఇక్కడ చూస్తుంటామని అన్నారు. వదంతులను నమ్మవద్దని, కొత్తవారి కదలికపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, అన్న బాలకృష్ణ, రామిరెడ్డి, నిరంజన్‌చారి, బొట్టు వెంకట్, చింతల నర్సింహరెడ్డి, సుక్క కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆఫ్ ఇండియా సొసైటీ అధ్యక్షుడిగా నవీన్‌కుమార్

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియాలో సీఎస్‌టీ అండ్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడిగా డా.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వెలుదండి సురేష్, కార్యదర్శిగా శ్రీధర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్‌లుగా జంగం క్రిస్టోఫర్, ఎస్.వల్లి కళ్యాణి ఎన్నికైనట్లు ప్రకటించారు. సొసైటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అవకాశం కల్పించిన సహచరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



సర్వే ఆఫ్ ఇండియాలో నూతనంగా ఎన్నికైన సొసైటీ కమిటీ ప్రతినిధులు